క్లుప్తంగా

పంచాయతీ కార్యాలయం పరిశీలన



పంచాయతీ సెక్రటరీకి సూచనలు చేస్తున్న కలెక్టర్ రామ్‌సుందర్ రెడ్డి

చీపురుపల్లిరూరల్ (గరివిడి): గరివిడి మండలం కొండపాలేం మేజర్ పంచాయతీ కార్యాలయాన్ని కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. సిబ్బంది విధులపై ఆరా తీశారు. అనంతరం అక్కడి వైద్యసిబ్బందితో మాట్లాడారు. పిల్లల వ్యాక్సినేషన్‌పై ఆరా తీశారు. తాగునీటి సరఫరా పరిస్థితిని పంచాయతీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఆశయ్య, తహసీల్దార్ సీహెచ్ బంగార్రాజు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాడీబిల్డర్‌కు అభినందనలు



లక్ష్మనాయుడును అభినందిస్తున్న జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు శ్రీనివాసనాయుడు

చీపురుపల్లి: జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలకు ఎంపికైన వంగపల్లిపేటకు చెందిన రెడ్డి లక్ష్మునాయుడును వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాస నాయుడు బుధవారం అభినందించారు. ఈ ఏడాది డిసెంబర్ 14, 15 తేదీల్లో చండీగర్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. లక్ష్మునాయుడు ఎచ్చెర్లలోని ట్రిపుల్ ఐటీలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయనను అభినందించిన వారిలో బాలుర ఉన్నత పాఠశాల పీఎంసీ కమిటీ చైర్మన్ గవిడి సురేష్, వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ప్రతినిధి ఎల్.ప్రభాత్, తదితరులు ఉన్నారు.

అధికారుల సమక్షంలో యూరియా పంపిణీ



యూరియా పంపిణీని పర్యవేక్షిస్తున్న అధికారులు

మెరకముడిదాం: మండలంలోని గర్భాం రైతు సేవా కేంద్రంలో తహసీల్దార్ సులోచనారాణి, వ్యవసాయశాఖాధికారి శ్రావణితేజ, ఇన్‌చార్జి ఎంపీడీఓ సుధాకర పట్నాయక్, బుధరాయవలస ఏఎస్ఐ ఆరీ సమక్షంలో యూరియాను రైతులకు పంపిణీ చేశారు. ఒక్కో రైతుకు బస్తా చొప్పున అందజేశారు.

పాలవలసలో వైద్యశిబిరం



పాలవలస వైద్యశిబిరంలో మాట్లాడుతున్న పొట్నూరు సన్యాసినాయుడు

గుర్ల: స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా గుర్ల మండలం పాలవలసలో బుధవారం వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. వైద్యాధికారి మధు రోగులకు వైద్యపరీక్షలు చేసి అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పొట్నూరు సన్యాసినాయుడు, మాజీ ఎంపీటీసీ బూర్లె శ్రీనివాసరావు సందర్శించారు. ప్రజలంతా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జంతు సంక్షేమ కమిటీ ఏర్పాటు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గోసంరక్షణ సమైక్య జిల్లా కార్యవర్గసభ్యులు

జామి: మండల జంతు సంక్షేమ కమిటీని ఏర్పాటు చేయాలని ఏపీ గోసంరక్షణ సమైక్య రాష్ట్ర కార్యదర్శి కేదారిశెట్టి సత్యనారాయణ తహసీల్దార్ కృష్ణంరాజును కోరారు. గోసంరక్షణ సమైక్య జిల్లా కార్యవర్గ సభ్యులతో కలిసి స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకా రం ప్రతీ మూడు నెలలకు ఒకసారి మండల జంతుసంరక్షణ కమిటీ సమావేశం నిర్వహిం చాల ని అన్నారు. కానీ మూడేళ్లుగా మండలంలో సమావేశం జరగలేదన్నారు. మండలంలో పశువుల అక్రమరవాణా, పశు మాంసం విక్రయాలు యథేచ్ఛగా సాగిపోతున్నాయని, లొట్లపల్లిలో అక్రమంగా పశువుల సంత నిర్వహిస్తున్నప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. తక్షణమే కమిటీ వేసి సమావేశం నిర్వహించాలని,.లేకుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. గోసంరక్షణ సమైక్య జిల్లా కార్యవర్గసభ్యులు సియ్యాదుల శ్రీనివాసరావు,బి.సంధ్యారాణి,ఎస్.రేణుక, టి.పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో అభివృద్ధి చేశాం



గంట్యాడ: ఎంపీపీ హైమావతికి అభినందనలు తెలుపుతున్న ఎంపీటీసీ సభ్యులు

గంట్యాడ: అందరి సహకారంతో గత నాలుగేళ్ల కాలంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని ఎంపీపీ పీరుబండి హైమావతి తెలిపా రు. ఎంపీపీ పదవి చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఆమెతో పాటు ఎంపీటీసీ సభ్యులను మండల పరిషత్ అధికారులు, సిబ్బంది, సర్పంచ్‌లు బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు తనకు పూర్తి సహాయ, సహకారాలు అందించారని చెప్పారు. ఇంకా ఏడాది పాటు పదవీకాలం ఉందని, ఈఏడాది కూడా గతంలో మాదిరి సహాయ సహకారాలు అందించాలని కోరారు. గ్రామాల్లో తాగునీటి బోర్లు, సీసీరోడ్లు, కాలువలు, గ్రావెల్ రోడ్ల నిర్మాణం చేపట్టామని తెలిపారు. మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య సహకారంతో తనకు ఎంపీపీ పదవి వచ్చిందన్నారు. వారికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని తెలిపారు. జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, వైస్ ఎంపీపీ సుంకరి సుజాత, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షులు పీరుబండి జైహింద్‌కుమార్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాము లమ్మ, ఈఓపీఆర్డీ విజయ్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ వేమలి రమణమ్మ, వైఎస్సార్ సీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడు కొండెల విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి తనవంతు కృషి చేశా

బొండపల్లి: మండల అభివృద్ధికి తనవంతు కృషి చేశానని ఎంపీపీ చల్లా చలంనాయుడు తెలిపారు. ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించి నాలుగేళ్లు పూర్తి చేసుకుని అయిదో సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధ వారం కేక్ కట్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగేళ్లు తనకు సహకరించిన అధికారులు, మండల ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. పీఆర్ జేఈఈ పి.అప్పలనాయుడు, బొండపల్లి ఎంపీటీసీ సభ్యుడు బి.శ్రీనివాస్,ఉప సర్పంచ్ కె.వెంకటరమణ,వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడు బోడసింగి జగదీశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మంచి పాలన అందించాం

దత్తిరాజేరు: మండల ప్రజా ప్రతినిధులు, అధికారుల సహకారంతో నాలుగేళ్లు మంచి పాలన అందించామని ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు తెలిపారు. ఎంపీపీగా పదవి చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైస్ ఎంపీపీ మిత్తిరెడ్డి రమేష్‌తో కలిసి బుధవారం విలేకరులతో మాట్లాడారు.గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో అర్హులందరికీ సంక్షేమ,అభివృద్ధి ఫలాలు అందించామని చెప్పారు.

మర్యాద పూర్వక కలయిక






మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో మాజీ ఎంపీ బెల్లాన, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే శంబంగి, బొత్స అప్పలనరసయ్య, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి నెక్కల నాయుడుబాబు, కె.వి.సూర్యనారాయణరాజు

దత్తిరాజేరు/కొత్తవలస: తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ ఎంపీలు, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులతో బుధవారం సమావేశమయ్యారు. అనంతరం జగన్‌మోహన్‌రెడ్డిని జెడ్పీ చైర్మన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ, పీఏసీ సభ్యుడు బెల్లాన చంద్రశేఖర్, బొబ్బిలి, గజపతినగరం మాజీ ఎమ్మెల్యేలు శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, బొత్స అప్పలనరసయ్య, ఎస్.కోట నియోజకవర్గానికి చెందిన నేత, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి నెక్కలనాయుడు బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. గజపతినగరం, ఎస్.కోట నియోజకవర్గాల్లో రాజకీయ పరిస్థితులపై వీరిని జగన్‌మోహన్‌రెడ్డి ఆరా తీశారు.

గుర్ల: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కె.వి సూర్యనారాయణ రాజు తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం మర్యాదపూరకంగా కలిశారు. జిల్లాలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని సూచించినట్టు ఫోన్‌లో విలేకరులకు తెలిపారు.

గాయత్రీదేవిగా కనకమహాలక్ష్మి



గాయత్రీదేవి అలంకరణలో కనకమహాలక్ష్మి



అన్నపూర్ణదేవిగా మానసాదేవీ నాగశక్తి అమ్మవారు

చీపురుపల్లి:

దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కనకమహాలక్ష్మి అమ్మవారు బుధవారం గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అలయ మండపంలో నిర్వహించిన కుంకుమ పూజల్లో మహిళలు పాల్గొన్నారు. రామలింగాపురం సమీపంలోని మానసాదేవీ నాగశక్తి అమ్మవారు అన్నపూర్ణదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పిల్లలకు చేతుల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న పీడీ విమలారాణి

గంట్యాడ: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని, ప్రతి ఒక్కరూ విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ పీడీ టి.విమలారాణి సూచించారు. మండలంలోని కొఠారుబిల్లి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం నిర్వహించిన పోషణ మహా కార్యక్రమంలో మాట్లాడుతూ ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు ఎక్కువగా తినడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని తెలిపారు. బొప్పాయిలో ప్రోటీన్లు అధికంగా ఉంటాయని చెప్పారు. ఐరన్ ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలు మనం రోజు తినే ఆహారం లో ఉండేటట్టు చూసుకోవాలన్నారు. ఆహారంలో ఉప్పు వాడకాన్ని తగ్గించుకోవాలని, స్వీట్స్ కూడా తగ్గించాలని చెప్పారు. అనంతరం చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ పీఓ ఉమాభారతి, సూపర్ వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వరద నీరు నిలిచిపోకుండా చర్యలు



కాలువ నిర్మాణం కోసం జేసీబీతో చేపడుతున్న దుకాణల తొలగింపు పనులు

కొత్తవలస: మండల కేంద్రంలోని రైల్వే అండర్ బ్రిడ్జి కింద వరద నీరు నిలిచిపోకుండా రైల్వే అధికారులు చర్యలు చేపట్టారు. బ్రిడ్జిని ఆనుకుని ఉన్న షాపులను బుధవారం జేసీబీతో తొలగించి, అరకు–విశాఖ జాతీయ రహదారిని అనుసంధానం చేస్తూ కాలువ నిర్మించేందుకు సిద్ధమయ్యారు. కాలువ నిర్మాణం వల్ల కొంతమేర బ్రిడ్జి కిందకు నీరు చేరే అవకాశం తగ్గుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఏది ఏమైనా రైల్వే అధికారులు ముందు చూపు లేకుండా బ్రిడ్జిని నిర్మాణం చేశారని, ఇప్పుడు నానా అవస్థలు పడాల్సి వస్తోందని పట్టణ వాసులు అంటున్నారు.

ఆయిల్ పామ్ సాగుపై అవగాహన



వీరభద్రపురంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఓ పద్మ

లక్కవరపుకోట/కొత్తవలస: ఆయిల్ పామ్ సాగుపై కొత్తలవస మండలంలోని వీరభద్రపురం గ్రామం, లక్కవరపుకోట మండలంలోని దాసుళ్లపాలెం గ్రామంలో రైతులకు ఉద్యానవన శాఖ అధికారి(హెచ్‌ఓ) పప్పు పద్మ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కల్పించారు. రైతులతో నిర్వహించిన సమావేశాల్లో ఆమె మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోందని చెప్పారు.

రైతులకు ఆయిల్‌పామ్ మొక్కలను రేగిడి మండలంలో ఉన్న శ్రీనివాసా పామ్ ఆయిల్ కంపెనీ అందిస్తుందని, పంటను కూడా వారే కొనుగోలు చేస్తారని తెలిపారు. ఈ పంట సాగుకు తక్కువ పెట్టుబడి అవుతుందని, అధిక లాభాలు సాధించవచ్చని తెలిపారు. ఈ పంటలో అంతర పంటలు సాగుచేసుకోవచ్చని,తద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని వివరించారు. ఆయిల్ పామ్ పంటను సాగు చేసేందుకు ఆసక్తి ఉన్న రైతులు తక్షణమే ఉద్యానవనశాఖ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. శ్రీనివాసా పామ్ ఆయిల్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

తాటిపూడి నీరు మళ్లింపు తగదు

శృంగవరపుకోట: జిల్లాలో రైతాంగానికి ప్రధాన సాగునీటి, తాగునీటి వనరుగా ఉన్న తాటిపూడి రిజర్వాయర్ నీటిని మళ్లించడం సరికాదని శాసనమండలిలో ప్రస్తావించినట్టు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు చెప్పారు. 15,200 ఎకరాలకు సాగునీరు, గ్రేటర్ విశాఖపట్నం, విజయనగరం, ఎస్.కోట,ఎల్.కోట, వేపాడ, జామి, కొత్తవలస, గంట్యాడ మండలాలకు తాగునీరు అందిస్తున్న తాటిపూడి రిజర్వాయర్ నుంచి నీటిని జిందాల్‌కు కేటాయిస్తామనడం అన్యాయం అన్నారు. దీనివల్ల ఈప్రాంతంలో సేద్యం, తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడాల్సివస్తుందన్నారు. జిందాల్ ఏర్పాటు చేస్తామన్న ఎంఎస్ఎంఈ పార్కులకు అనాలోచితంగా తాటిపూడి నీరు కేటాయిస్తే మళ్లీ ఈ ప్రాంత రైతాంగం ఇబ్బందులు పడతారని సభ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఈ ప్రతిపాదనపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని సభను కోరినట్టు చెప్పారు.

ఎస్‌డబ్ల్యూపీసీ పరిశీలన



ఎస్‌డబ్ల్యూపీసీలో కుండీలను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ సత్యనారాయణ

దత్తిరాజేరు: చినకాద గ్రామంలోని ఎస్‌డబ్ల్యూపీసీని (చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం) జిల్లా పరిష త్ సీఈఓ బి.వి.సత్యనారాయణ బుధవారం ఉదయం పరిశీలించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా కుండీల్లో వేయాలని, సేంద్రియ ఎరువు తయారు చేసి రైతులకు తక్కువ ధరకు విక్రయించాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు.అంతకుముందు గ్రామంలో గ్రీన్‌అంబాసిడర్లు చేపడుతున్న ఇంటింట చెత్తసేకరణను పరిశీలించారు. రోజూ గ్రీన్‌అంబాసిడర్లు ఇళ్లకు వచ్చి చెత్త సేకరిస్తున్నారా లేదా అని గ్రామంలోని మహిళలను అడిగి తెలుసుకున్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని ప్రజలకు సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసం దర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రిన్సిపాల్ సీహెచ్.కేశవరావు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ క్యాడెట్లతో కలిసి అధ్యాపకులు మొక్కలు నాటారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ శశికళ



అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రదర్శించిన పౌష్టికాహారాన్ని పరిశీలిస్తున్న వైద్యాధికారులు

చీపురుపల్లి: తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శశికళ అన్నారు. విజయా కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మహా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. తల్లిపాల ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ భారతి, ఆశ వర్కర్ విజయ పాల్గొన్నారు.

మెరకముడిదాం: తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యకరమని, రోగనిరోధక శక్తి లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్ వైజర్ తాడ్డి శ్రీదేవి తెలిపారు. గర్భాం పీహెచ్‌సీ ఆవరణలో ఏర్పాటుచేసిన పౌష్టికాహారం ప్రదర్శనను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు, కిశోరీబాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గర్భాం పీహెచ్‌సీ వైద్యాధికారులు అనిల్‌కుమార్‌రెడ్డి, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

చెత్తసేకరణలో నిర్లక్ష్యం వద్దు



ఎంపీడీఓ కార్యాలయంలో ఆర్డీఓ, డీఎస్పీ, ఎంపీడీఓలతో మాట్లాడుతున్న కలెక్టర్ రామ్‌సుందర్ రెడ్డి

చీపురుపల్లి: ఇంటింటి చెత్తసేకరణలో నిర్లక్ష్యం చూపరాదని కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. చీపురుపల్లి ఆర్డీఓ, ఎంపీడీఓ కార్యాలయాలను బుధవారం సందర్శించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో మాట్లాడారు. ఇంటింటా చెత్త సేకరణ నిర్వహణపై ఎంపీడీఓను ప్రశ్నించారు. మండలంలో 17,400 ఇళ్లు ఉండగా అందులో బుధవారం 15,400 నివాసాల్లో చెత్త సేకరణ జరిగినట్టు వివరించారు. ఎరువు పంపిణీపై అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ బి.ఆశయ్య, డీఎస్పీ ఎస్.రాఘవులు, తహసీల్దార్ డి.ధర్మరాజు, ఎంపీడీఓ ఐ.సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రమణరాజు జన్మదిన వేడుకలు



సోమలింగాపురంలో రమణరాజుతో కేకును కట్‌చేయిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మెరకముడిదాం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు జన్మదిన వేడుకలు ఆయన స్వగృహం సోమలింగాపురంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అభిమానులు ఏర్పాటుచేసిన కేక్‌ను కట్‌చేసి పంచిపెట్టారు. ఆయనకు పార్టీ నాయకులు తాడ్డివేణుగోపాల్‌రావు, కోట్లవిశ్వేశ్వరరావు, కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్, బూర్లె నరేష్‌కుమార్, వైస్ ఎంపీపీ తలచుట్ల హరిబాబు, ఎంపీటీసీ సభ్యుడు ఎస్.సీతారామరాజు, ఎస్.కృష్ణమూర్తిరాజు, ఎస్.రామరాజు తదితరులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



జామి: అలమండలో అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన దుర్గామాత



శృంగవరపుకోట : ధర్మవరంలో అన్నపూర్ణాదేవిగా దర్శనమిస్తున్న దుర్గమ్మ



వేపాడ: వల్లంపూడిలో శాకంబరీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



జామి: భీమసింగి సుగర్‌ఫ్యాక్టరీ వద్ద సామూహిక కుంకుమ పూజలు

అన్నపూర్ణగా దుర్గమ్మ

శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గజపతినగరం, ఎస్.కోట, చీపురుపల్లి నియోజకవర్గాల్లోని దుర్గాదేవి ఆలయాల్లో, గ్రామాల్లో ఉత్సవ కమిటీలు ఏర్పాటు చేసిన మంటపాల్లో మూడో రోజు అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వేపాడ మండలంలోని వల్లంపూడి గ్రామంలో ఏర్పాటు చేసిన మంటపంలో అమ్మవారిని శాకంబరీ దేవిగా దర్శనమిచ్చారు. కొత్తవలస మండలంలోని కంటకాపల్లిలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్

బాధిత రైతులకు న్యాయం చేయండి



ఎంపీపీ చలంనాయుడు

బొండపల్లి: దేవుపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో రైతుల జిరాయితీ భూమిలో సాగు చేసుకుంటున్న చెట్లను అక్రమంగా నరికివేసిన వారిపై చర్యలు తీసుకుని, బాధితులకు న్యాయం చేయాలని ఎంపీపీ చల్లా చలం నాయుడు అధికారులను కోరారు. మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరు ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేవుపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 322/6లో జీరాయితీ సాగు భూమిని సారికి సూర్యనారాయణ అనే రైతు నుంచి చేకూరి సూర్యనారాయణరాజు, ముదునూరు సన్యాసిరాజు అనే రైతులు 2005లో కొనుగోలు చేసుకుని మామిడితోటలను సాగు చేస్తున్నారని తెలిపారు. 8.49 ఎకరాల భూమి ఈ రైతులు సాగులోనే ఉన్నట్లుగా 2018జనవరి 29న అప్పటి సర్వేయర్‌గా ఉన్న గణపతిరావు ఉన్నతాధికారులకు నివేదిక కూడా ఇచ్చారని గుర్తు చేశారు.ఈ భూమిలో ఉన్న మామిడి చెట్లను వారం రోజుల క్రితం ఇట్లా తిరుపతిరావుతో పాటు వెన్నెల రాము నాయుడు,పైల నటరాజు,మరో అయిదుగురు వ్యక్తులు అక్రమంగా నరికివేశారని తెలిపారు. బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. 2005 సంవత్సరం నుంచి భూములను సాగు చేసుకుంటున్న రైతులకు తెలియకుండా ప్రస్తుత తహసీల్దార్ రాజేశ్వరరావు చలుమూరి సౌమ్యశ్రీకి ఏలా వన్‌బీ ఇచ్చారని ప్రశ్నించారు.ఇప్పటికైనా అధికారులు కూటమి నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గకుండా బాధిత రైతులకు న్యాయం చేయాలని కోరారు.

ఆలయ సింహ ద్వారం ప్రారంభం



సింహ ద్వారాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ కీర్తి, వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు అప్పలనాయుడు

బొండపల్లి: నెలివాడ గ్రామ దేవత బిత్రమ్మ తల్లి ఆలయానికి వైఎస్సార్‌సీపీ మండ ల ఉపాధ్యక్షుడు తాళ్లపూడి అప్పలనాయుడు,సర్పంచ్ తాళ్లపూడి కీర్తి తమ సొంత నిధులు రూ.3.60 లక్షలతో మహా సింహ ద్వారాన్ని నిర్మించారు. ఈ సింహ ద్వారాన్ని మంగళవారం వారు ప్రారంభించారు. ముందుగా వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యులు కొమ్మూ నాగమణి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

‘ఏదయా మీదయా మామీద లేదు’



శృంగవరపుకోట: డాక్టర్ వరలక్ష్మి స్కూల్‌లో నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

బొండపల్లి:

వేంద్రాం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం, ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అసిరి తవిటిందొర ఆధ్వర్యంలో బుధవారం దసరా వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలతో ఎప్పుడో రెండు దశాబ్దాల క్రితం నాటి జ్ఞాపకాలను విద్యార్థులు మళ్లీ ప్రజలకు గుర్తు చేశారు. బాణాలను చేతబూని, సంచుల్లో తంగెడు పత్రిని వేసుకుని వీధుల్లో పాటలు పాడుతూ తిరిగారు. ‘ఏదయా మీదయా మామీద లేదు’ అంటూ పాటలు పాడి అలనాటి స్మృతులను గుర్తు చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా దసరా వేడుకలు

శృంగవరపుకోట: మండలంలోని భవానీనగర్ వద్ద ఉన్న డాక్టర్ వరలక్ష్మి స్కూల్‌లో దసరా వేడుకలను బుధవారం ఘనం గా నిర్వహించారు.విద్యార్థులు సంప్రదాయ దుస్తులను ధరించి వేడుకలకు హాజరయ్యారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, రావణ దహనం నాటిక ఆకట్టుకుంది. ప్రిన్సిపాల్ వై.జానకీదేవి మాట్లాడుతూ మన హిందువుల సంప్రదాయాలు, పండగలు, వాటి విశిష్టతను తెలియజేయాలన్న ఉద్దేశంతో ఇలా ప్రతీ పండగను విద్యార్థుల మధ్య నిర్వహిస్తూ వారిలో ఐక్యత, పరస్పర గౌరవం, పెంపొందించే దిశగా కృషి చేస్తున్నామన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



బొండపల్లి: వేంద్రాంలో బాణాలు ఎక్కుపెట్టి పాటలు పాడుతున్న విద్యార్థులు